epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 38 | శనివారం | 25.05.2024



## కాంగ్రెస్ గ్యారెంటీలు అమలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర నేత జి.నాగయ్య

2



## ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

3



## రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

- బ్యాలెట్ పేపర్ చూపిస్తూ ప్రచారం

3



# పదేండ్లు కొట్లాడిండు

- కేసీఆర్ ప్రభుత్వం కక్షగట్టి జైలుకు పంపింది
- అధికారం పోయినా అహంకారం తగ్గలే
- ప్రజాపాలన అందిస్తున్న సర్కారుపై కారు కూతలు
- పట్టభద్రుల ఆత్మబంధువు తీన్మార్ మల్లన్న
- రాష్ట్రమంత్రి ధనసరి సీతక్క

**ములుగు, మన చౌరాస్తా :** గత పదేండ్ల పాలనలో యావత్తు తెలంగాణ ప్రజలను మోసం చేసి తెలంగాణ రాష్ట్ర ఖజానాను దోచుకున్న పార్టీ బీఆర్ఎస్ అని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు మండలంలోని ఇంచర్ల ఎంఆర్ గార్డెన్‌లో ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అధ్యక్షతన శుక్రవారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పట్టుమని ఆరు నెలలు కాకుండానే కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.500 బోనస్ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు.

మిగతా 2లో..



## మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా
- పెంబర్తిలో కుట్టు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

2




General News

# పదేండ్లు కొట్లాడిండు

(మొదటి పేజీ తరువాయి)
ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు, ఆగస్టు 15 నాటికి రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని తెలిపారు. మెగా డీఎస్సీ ప్రకటనలు ఇప్పటికే ఇచ్చామని, శాశ్వత పద్ధతిన ఉద్యోగ భర్తీ చేపట్టి గత పదేండ్ల దుర్మార్గుల పాలన నుంచి తెలంగాణను విముక్తి చేస్తామన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, కేటీఆర్‌కు అధికారం పోయినా.. అహంకారం తగ్గలేదని, ప్రజాపాలన అందిస్తున్న సర్కారుపై కారుకూతలు కూస్తున్నాడని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీపై కావాలని కొందరు అసత్య ప్రచారాలు చేయడం దుర్మార్గమని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో తీన్మార్ మల్లన్నను గెలిపించాలని, మల్లన్న పోరాట పటిమ కలిగిన వ్యక్తి అని తెలిపారు. దొరల అహంకారపూరిత ధోరణిపై తిరుగుబాటు జెండా ఎగరేసిన వ్యక్తి అని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అన్యాయాలు, అక్రమాలను బయటకు తీసిన ప్రజాగొంతుక అని, మే 27న మల్లన్నకు మొదటి ప్రాధాన్యతను ఓటు వేసి గెలిపించాలని కోరారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై తీన్మార్ మల్లన్న తన క్యూ న్యూస్ ఛానల్ ద్వారా ప్రజలను ఎప్పటికప్పుడు మేలుకొల్పారని గుర్తు చేశారు. ప్రజల పక్షాన కొట్లాడిన మల్లన్నపై నాటి కేసీఆర్ ప్రభుత్వం కక్షగట్టి జైలుకు పంపిందని చెప్పారు.



# మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :** మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తి గ్రామం లోని మహిళా మండల భవనంలో స్కూల్ యూనిఫామ్ దుస్తుల మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సందర్శించారు. పెంబర్తి గ్రామ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు కుడుతున్న విద్యార్థుల యూనిఫామ్ దుస్తులను కలెక్టర్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో యూనిఫామ్‌లు నిర్ణీత సమయంలో అందజేయాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు కుట్టిన యూనిఫామ్ ను విద్యార్థినికి ధరింపజేసి ప్రత్యక్షంగా పరిశీలించారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ 3,117 స్కూల్ యూనిఫామ్‌లు కుట్టించి సిద్ధంకి, పెద్ద పహాడ్, చౌడారం, పెంబర్తి కేంద్రాలలో ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు 800 యూనిఫామ్ దుస్తులు కుట్టడం జరిగిందన్నారు. జూన్ 5 తేదీలోపు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, అందుకొరకే యూనిఫామ్ దుస్తులు కుట్టే బాధ్యతను మహిళలకే అప్పగించినట్లు తెలిపారు. మహిళలు సాధికారిత దిశగా కొనసాగడం అభినందించదగిన విషయమని ఇకముందు కూడా మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మొగులప్ప, ఎంపీడీవో సంపత్, ఏపిఎం కవిత, సీసీలు శ్రీనివాస్, శంకర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి పనులు పూర్తి చేయాలి

జనగామ, మన చౌరాస్తా : పాఠశాలలో చేపట్టిన తాగునీటి వసతి , అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని పాఠశాలలో తాగునీటి సౌకర్యానికి నిర్మించిన అసంపూర్తిగా నిలిచిన పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల మౌలిక వసతుల కల్పన కొరకు చేపడుతున్న పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో మొగులప్ప, ఎంపీడీవో సంపత్ తదితరులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ గ్యారెంటీలు అమలు చేయాలి

- రైతుకూలీలకు, కౌలుదారులకు రూ.12 వేలు ఇవ్వాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య డిమాండ్

**జనగామ, మన చౌరాస్తా :** గత ఎన్నికల్లో గ్రామీణ ప్రాంత భూమిలేని వ్యవసాయ కార్మికులకు, కౌలు రైతులకు రూ.12 వేలు, మహిళలకు రూ 2500 , ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్న ఆరు గ్యారెంటీల హామీలలో ఉన్న ముఖ్యమైన వాటిని అమలు చేయడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడకపోవడం ఆందోళన కలిగిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య అన్నారు. శుక్రవారం జనగామ లోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు పోత్కనూరి ఉపేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్లీనం సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య పాల్గొని మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు, పెండింగ్లో ఉన్న ఉపాధి కూలీల బకాయిల విడుదలకు తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్పాటంగా గ్రామీణప్రాంత పేదలకు ప్రకటించిన హామీల గురించి నేటి వరకు మాట్లాడకపోవడం ప్రభుత్వ దాటవేత చర్యలకు నిదర్శనం అన్నారు. గ్రామపంచాయతీ యూనిట్ గా కౌలు రైతులను, భూమిలేని వ్యవసాయ కార్మికులను, ఇండ్ల స్థలాలు లేని పేదలను గుర్తించటానికి చర్యలు చేపట్టాలని కోరారు. స్థలాలు ఉన్నవారికి ఐదు లక్షలు ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడానికి ఇస్తామన్న వాగ్దానం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఆ భూములపై హక్కు పట్టాలిచ్చి ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1,20,000 మంది వ్యవసాయ కూలీలు గ్రామీణ ఉపాధి కూలీలుగా పనిచేస్తున్నారని నాలుగు వారాల పైన కూలీలు చేసిన పనికి వేతనాలు చెల్లించలేదని తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పనిచేసే దగ్గర కనీస సౌకర్యాలు లేవని అన్నారు. తాగడానికి మంచినీళ్లు కూడా సరఫరా చేయకపోవడం దుర్మార్గం అన్నారు. ఎస్సీ ఎస్టీల బీడు భూముల అభివృద్ధికి చిన్న సన్నకారు రైతుల భూముల అభివృద్ధికి గ్రామీణ ఉపాధి పనులు పెట్టాలని డిమాండ్ చేశారు. చౌడు భూములకు చెరువుల వండ్రు మట్టిని ఫ్రీగా తోలాలని, చేసిన పనికి వారంవారం వేతనాలు చెల్లించాలని, పని చూపని దగ్గర నిరుద్యోగభృతి చెల్లించాలన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు. క్యూబిక్ మీటర్ల కొలతల పేరుతో చట్ట ప్రకారం 300 రూపాయలు వేతనం పడకుండా చేస్తున్నారని పని ప్రదేశంలో ఉదయం సాయంత్రం ఫోటోలు తీసే పేరుతో కూలీలను తీవ్రంగా వేధిస్తున్నారని తక్షణమే ఈ చర్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూలీలందరికి పారా, పలుకు, తట్ట, గొడ్డలి, కొడవలి వంటి పనిముట్లు ఇవ్వాలని కిలోమీటర్లు దాటిన పనికి లోకల్ ఆటో చార్జీ ఇవ్వాలని చట్టంలో ఉన్న అధికారులు అమలు చేయకపోవడం వలన కూలీలు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ఎండలు తీవ్రతను దృష్టిలో పెట్టుకొని త్రాగడానికి మంచినీరు, నీడకు టెంటు, మెడికల్ కిట్టు ఇవ్వాలని కోరారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక జిల్లా అధ్యక్షులుగా గంగాపురం మహేందర్, జిల్లా ప్రధానకార్యదర్శిగా సింగారపు రమేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ కార్యక్రమంలో సుధాకర్, రమేష్, సోమసత్యం, ఎల్లయ్య, మమత, కిష్టయ్య, బాబు, నారాయణ, శంకరయ్య, రాములు, మల్లేష్, రవి, యాకన్న, కొమురయ్య, పూలమ్మ, నర్సమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

Local News

# ఎమ్మెల్సీ ఎన్నికలకు అంతా రెడీ

- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్
- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా



**వరంగల్, మన చౌరాస్తా :** ఈ నెల 27వ తారీఖున నల్లగొండ, వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో (వరంగల్, హనుమకొండ, జనగామ )144 సెక్షన్ అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఓ ప్రకటనలో తెలియజేసారు.వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు గాను ఈ నెల 27 తేది ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ సభలు,ర్యాలీలు నిషేధం ఉంటుందని. ఎన్నికల వేళ పోలింగ్ కేంద్రాల చుట్టూ గుమిగూడరాదన్నారు . పోలింగ్ కేంద్రం నుండి 200 మీటర్ల హద్దును దాటి ఓటర్లు తప్ప ఎవ్వరు లోపలికి రాకూడదని సూచించారు.కావున కమిషనరేట్ పరిధిలోని ప్రజలు ఇట్టి విషయం పైన దృష్టి సారించి పోలీస్ అధికారులకు,సిబ్బందికి సహకరించాలని కోరారు.ఎవరైనా ఈ నియమ నిబంధనలను పాటించకుండా ఇబ్బందులకు గురిచేస్తే అట్టి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# పనులను త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

**హనుమకొండ, మన చౌరాస్తా :** ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో మొదలైన పనులను వేగవంతంగా ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని బైరాన్ పల్లి, హరిశ్చంద్ర నాయక్ తండా, కొత్తపల్లి, అర్వపల్లి లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను నాణ్యతగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల పునః ప్రారంభం సమీపిస్తున్న నేపథ్యంలో పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులను తయారు చేస్తున్న బైరాన్ పల్లి లోని మహిళా స్వశక్తి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏకరూప దుస్తులను నిర్ణీత గడువులోగా అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సూచించారు.


WANTED విలేకరులు కావలెను

www.manachourasta.com

మన చౌరాస్తా

The Complete News way




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812




# రాకేశ్‌రెడ్డి కోసం ఇంటింటి ప్రచారం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి కోసం ఆ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 28 ,29 వార్డుల్లో బ్యాలెట్ పేపర్‌లోని 3వ నెంబర్ క్రమసంఖ్యలో మొదటి (1) ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, జనగామ సోషల్ మీడియా కన్వీనర్ తుంగ సతీష్, నాయకులు చల్ల శివ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 21వ వార్డులో కౌన్సిలర్ కర్రె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ యువజన అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, 21వ వార్డు అధ్యక్షుడు మంగ రామకృష్ణ పాల్గొన్నారు.



# మృతురాలి కుటుంబానికి కొమ్మూరి ఆర్థిక సాయం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని ధర్మకంచ 13వ వార్డులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇల్లెందుల భిక్షపతి, ఇల్లెందుల సుధాకర్ తల్లి ఇల్లందుల సిద్ధమ్మ శుక్రవారం మృతి చెందారు. కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశానుసారం మాజీ కౌన్సిలర్, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి మేడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కొమ్మూరి అందించిన ఆర్థిక సాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో 13వ వార్డు అధ్యక్షుడు మిద్దెపాక స్టాలిన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడిశాల అశోక్, దేవులపల్లి సుదర్శన్, తిప్పారపు ఉప్పలయ్య. తిప్పారపు రామచంద్రం, తోట జాన్, మల్లిగారి యాదగిరి, యూత్ నాయకుడు పల్లె శ్రీనాథ్, తిప్పారపు రాకేష్ పాల్గొన్నారు.



# చిల్ అవుతున్న అనసూయ

మన చౌరాస్తా, సినిమా : తెలుగులో యాంకర్ అంటే గుర్తుకొచ్చే వారిలో అందాల అనసూయ ఒకరు. న్యూస్ రీడర్ గా కెరీర్ మొదలు పెట్టిన అనసూయ... తరువాత యాంకర్ గా, హీరోయిన్ గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ఇలా పలు విభిన్న పాత్రల్లో కనిపిస్తూ మెప్పిస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన రంగస్థలంలో అనసూయ చేసిన క్యారెక్టర్.. తన కెరీర్ లో ఓ మైలు రాయి అని చెప్పవచ్చు. ఇక అనసూయ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ బహిరంగంగానే ముద్దులు, హగ్గులు, బికినీలతో రచ్చ చేస్తూ.. ట్రోలింగ్ బారిన పడుతుంటారు ఆమె. అంతేకాదు ఆమెను నిత్యం వివాదాలు చుట్టుముట్టుతుంటాయి. ఈ వివాదాల నుంచి కొద్ది రోజులు దూరంగా ఉండడంతో పాటు ఈ వేసవి తాపం తీర్చుకోవడానికి ఫ్యామిలీతో కలిసి సమ్మర్ వేకేషన్ కు వెళ్లింది. వాటర్ ఫాల్స్ లో అందాలను ఆరబోస్తూ.. ఫారెస్ట్ లలో తన భర్త కలిసి ఎంజాయ్ చేస్తుంది. తమతో పాటు తమ పిల్లలు కూడా రోజు ఒక వాటర్ ఫాల్ ను దర్శించి వేసవి తాపం నుంచి చిల్ అవుతున్నారు. అయితే తాజాగా వాటర్ ఫాల్ లో ఎంజాయ్ చేస్తున్న ఫోటోలను అనసూయ తన ఇన్ స్టా ఖాతాలో పోస్టు చేసింది. ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

